విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి నెం. 5
మంగళవారం 18, జూన్, 2024

రాష్ట్ర హోం మంత్రికి అభినందనలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ రాష్ట్ర హోం మంత్రిగా నియమితులైన వంగలపూడి అనిత విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబును గోపాలపట్నంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబుతోపాటు విశాఖ టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నందవరపు సోములు, నాయకులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతామని, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గంజాయి స్మగ్లర్ల విషయంలో సొంత పార్టీ వారు ఒత్తిడి చేసినా ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు చెప్పినట్టు తెలిపారు. సోమవారం సర్క్యూట్ హౌస్‌లో జరిగిన విలేకరుల సమా వేశంలో ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రభుత్వ హయంలో విశాఖలో విచ్చలవిడిగా గంజాయి వ్యాపారం, రవాణా జరిగిందన్నారు. విశాఖను గంజాయి హబ్‌గా మార్చేశారన్నారు. రాష్ట్రంలో, విశాఖలో హింసకు ప్రధాన కారణం గంజాయేనని తెలిపారు. కర్రీ లీఫ్స్ పేరుతో ఆన్లైన్ ఫ్లాట్ ఫారంలో విక్రయాలు జరపటం విచారకరం అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం విధానాల వల్ల 1,230 మంది గంజాయి కేసుల్లో ఇరుక్కున్నా రన్నారు. గంజాయి కేసుల పట్ల ఒక్క రివ్యూ కూడా పెట్టకపోవడం దారుణం అన్నారు. పోలీసులకు కనీస వసతులు కల్పించలేదని, నిధులు కూడా కేటాయించలేదన్నారు. అకాడమి ఏర్పాటుకు దృష్టి సారించలేదని విమర్శించారు. రాష్ట్ర రాజధాని అని చెప్పి విశాఖను గంజాయి, డ్రగ్స్‌కి రాజధాని చేశారని మండిపడ్డారు. గంజాయిని అరికట్టడంలో జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లోనూ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల నుంచి సమాచారం తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. టాస్క్ ఫోర్స్ ద్వారా గంజాయి అక్రమ రవాణాపై దృష్టి సారిస్తామని, మూలాలపై దృష్టి సారిస్తామన్నారు. ఈ క్రమంలో చెక్ పోస్టులు పెంచుతున్నామన్నారు. ఒరిస్సా నుంచి కూడా రవాణా జరుగుతుందని తన దృష్టికి వచ్చిందని, అక్కడి అధికారులతో కూడా సమావేశం నిర్వహిస్తామన్నారు. విశాఖ నగరంలో 1700 సిసి కెమేరాలు సగానికి పైగా పని చేయకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. మూడు నెలల్లో ప్రక్షాళన చర్యలు చేపడతామని, గంజాయిని అరికడతామన్నారు. దీన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకొని పనిచేస్తామన్నారు. డి అడిక్షన్ కేంద్రాల సంఖ్యను పెంచుతామని, యువతకు, గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు పెడతామన్నారు. గంజాయిని అరికట్టడం ద్వారా నేరాలను అదుపు చేస్తామన్నారు. పోలీస్ సేవలను గుర్తిస్తామని, వారిని గౌరవిస్తామన్నారు. డ్రోన్లను ఉపయోగించి గంజాయి తోటలను గుర్తించి తుది చర్యలు చేపడతామన్నారు. రాత్రి పూట విశాఖ నగరంలో గుంపులు, గుంపులుగా ఉండే వారిపై దృష్టి సారిస్తామన్నారు. గంజాయి విషయంలో పోలీసులకు సహకరించి సమాచారం అందించిన వారికి ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. గంజాయి నియంత్రణకు, మహిళా రక్షణకు, భూ దోపిడీ నిలుపుదలకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. దిశ మహిళా పోలీస్ స్టేషన్ల పేర్లను మారుస్తామని, కేవలం మహిళా పోలీస్ స్టేషన్లగానే ఉంటాయన్నారు. రాజకీయపరమైన దాడులకు మేము పాల్పడటం లేదని, అది కృత్రిమ ప్రచారమని దానిపై కూడా దర్యాప్తు చేపడతామని చెప్పారు. తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవ్ టీజింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ఒక టీచర్‌గా పిల్లల్ని సరిదిద్దిన విధంగానే వ్యవస్థను కూడా సరిదిద్దుతానని పేర్కొన్నారు.

శాంతి భద్రతలపై అనిత సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ హోంశాఖ, విపత్తుల నిర్వహణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వంగలపూడి అనిత సోమవారం మధ్యాహ్నం విశాఖ సర్క్యూట్ హౌస్‌లో పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విశాఖలో శాంతి భద్రతలు, గంజాయి రవాణా, మాదక ద్రవ్యాలు సరఫరా, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా ఎ.మల్లికార్జున, కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ.రవిశంకర్, అదనపు పోలీసు కమిషనర్ ఫకీరప్ప, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని సత్కరించిన ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి విశాఖకు వచ్చిన కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి వచ్చిన కింజరాపు అచ్చెన్నాయుడులను పెందుర్తి ఎమ్మెల్యే, జనసేన పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు ఘనంగా సత్కరిం చారు. సోమవారం ఉదయం విశాఖపట్నం విమానాశ్రయంలో పుష్ప గుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా నేతలు ఉత్తరాంధ్ర రాజకీయాలపై చర్చించారు. అంతకు ముందు విమానాశ్రయానికి వచ్చిన కేంద్ర, రాష్ట్ర మంత్రులకు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా వచ్చి ఘనస్వాగతం పలికారు. అభిమానులు గజమాలతో సత్కరించారు.

గంటా రవితేజను కలిసిన ఉదయ్ శంకర్

విశాలాంధ్ర - ఆనందపురం: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి టీడీపీ భీమిలి నియోజకవర్గంలో అఖండ విజయం సాధించి సుమారు 92 వేల ఓట్లకు పైగా విజయ కేతనం ఎగరవేసింది. అందుకుగాను విజయోత్సవ ర్యాలీ నియోజకవర్గంలో మొదటి విడతగా భీమిలి మండలం అన్నవరంలో సాగింది. ముఖ్య అతిథులుగా భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, కుమారుడు రవితేజ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అందులో భాగంగా రవితేజను ఆనందపురం మండల నాయకులు మామిడి ఉదయ శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించారు. అందుకు రవితేజ సానుకూలంగా స్పందించారు.

విలేకరి కిషోర్‌ను పరామర్శించిన ముమ్మన

విశాలాంధ్ర - పెందుర్తి: గత ఎన్నికల సమయంలో రోడ్డుప్రమాదంలో గాయపడి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న వేపగుంట ప్రజాశక్తి విలేకరి కే.కిషోర్‌ను జీవిఎంసీ 95వ వార్డు కార్పోరేటర్ ముమ్మన దేముడు సోమవారం పరామర్శించారు. నాయుడుతోట సమీపంలో కిషోర్ ఇంటికి వెళ్లిన ముమ్మన దేముడు కిషోర్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్, మందుల వినియోగం తదితర వివరాలు తెలుసుకొని ఆరోగ్యం కుదుటపడేవరకు జాగ్రత్తగా ఉండాలని కిషోర్‌కు సూచించారు.

హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కమిషనర్‌గా బోడపాటి శివదత్



విశాలాంధ్ర - పాయకరావుపేట: హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషనర్ (రోవర్)గా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ వారు బోడపాటి శివదత్‌కు అందించారు. శివదత్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కేజీహెచ్‌లో మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో అత్యధిక మంది పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న కింగ్ జార్జ్ ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విభాగాధి పతులు, వైద్యులు కృషి చేయాలని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా ఎ.మల్లికార్జునతో కలిసి కేజీహెచ్ విభాగాధిపతులు, వైద్యులతో పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కేజీహెచ్‌కు వచ్చే రోగులు చాలా నిరుపేదలని అత్యవసర సమయాలలో సాధ్యమైనంతగా మంచి వైద్యం అందించి వారికి సహాయం చేయాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సంతృప్త స్థాయిలో వైద్య సేవలు అందించి సహకరించాలని కోరారు. ప్రతి వైద్యుడు ఆసుపత్రికి వచ్చే రోగులను జాగ్రత్తగా పరిశీలించి మంచి వైద్యం అందించాలని అన్నారు. వైద్యులు కలిసికట్టుగా పనిచేసి ఆసుపత్రికి మంచి గుర్తింపు తీసుకురావాలని పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా ఎ.మల్లికార్జున మాట్లాడుతూ కేజీహెచ్‌లో సి.ఎస్.ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. శివానందం, ఏఎంసీ ప్రిన్సిపాల్ డా.బుచ్చిరాజు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ బి.ఎ.నాయుడు, వైద్యాధికారులు, ఇతర ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారుల సేవలు భేష్

ఉక్కు జీఎం మధుసూదన్‌రావు

విశాలాంధ్ర - గాజువాక: విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన జీఎం బి.టి.నాయక్, డి.జీ.ఎం (హెచ్ఆర్ - లైజన్ ఆఫీసర్) వి.తిరుపతిరావు సేవలు భేష్ అని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (ఎం.ఎస్) ఎం.మధు సూదనరావు ప్రశంసించారు. సోమవారం స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీ భవన్‌లో ఉక్కు అధికారులు బి.టి.నాయక్, వి.తిరుపతిరావు ఆత్మీయ సత్కార కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బి.టి.నాయక్, తిరుపతిరావులు విశాఖ ఉక్కు కర్మాగారంలో వివిధ హెూదాలలో విధులు నిర్వహించి పలువురు మన్ననలు పొందారు అని అన్నారు. అధికారులు, ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలు, హక్కుల కోసం తమ వంతు సేవలను అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన అధికారులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. సీ జాయింట్ సెక్రటరీ ఆర్.నరసింహ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, అధికారులు దుర్గా ప్రసాద్, బి.ఎస్.ఆర్.నాయక్, గణేష్, బి.బాలాజీ, తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాణోత్ కృష్ణ, ఏ.పి గిరిజన సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు బి.కోటేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, ఎన్.నర్సింగరావు పాల్గొన్నారు.

జీవో నెం.596ను రద్దు చేయాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆందోళన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆర్థికంగా వెనుకబడి ఉన్న దళితులకు భూములను దూరం చేసే జీవో నెంబర్ 596ను రద్దు చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా అమలు చేయాలని కోరుతూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఎల్ఐసి కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వం దళిత వ్యతిరేక చర్యల వలన ప్రజా వ్యవస్థలను నిర్వీర్యం చేశారని అందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించక సబ్ ప్లాన్ నిధులను జనరల్ పథకాలకు మళ్లించి దళితులకు అన్యాయం చేశారని ఆ సంఘం నేతలు ఆరోపించారు. అదేవిధంగా విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, కులాంతర వివాహాల ప్రోత్సాహం, ఉపాధి అవకాశాలు కల్పించాలని, దళితుల భూములు దళితులకే ఇవ్వాలని, దళితుల భూములకు రక్షణ కల్పించాలని, ఆటంకాలుగా వున్న జీవో 596లను రద్దు చేయాలని, దళిత గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గత ప్రభుత్వం హయాంలో నిలిపి వేసిన స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి తీరుకోటి చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు, నేతలు సుబ్బారావు, శేఖర్, నర్సింగరావు, ఇమాన్యుల్, సరోజినీ పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వైసీపీ పాలనలో బాధ్యతలను మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకో వాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ కోరారు. సోమవారం సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా పోలీసు అధికారులు వైసీపీ నాయకుల పట్ల తొత్తుల మాదిరిగా వ్యవరించారన్నారు. వైసీపీ ప్రభుత్వం అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పోరాటం చేసిన తనపై అప్పటి మంత్రి గుడివాడ అమర్ అనుచరులు ఫోన్ చేసి దుర్భాషలు ఆడడంతో పాటు చంపుతామని బెదిరించారన్నారు. మరోవైపు తను ఇంట్లో లేని సమయంలో పోలీసులు వచ్చి తమ తండ్రిని బెదిరించడంతో ఆసుపత్రి పాలయ్యారన్నారు. అంతేకాకుండా తన కారును కూడా గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ప్రస్తావించారు. ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో.. అప్పటి హోం శాఖ మంత్రి మేకతోటి సుచరితకు ఫిర్యాదు చేశానన్నారు. ఈ నేపథ్యంలో నిందితులపై అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ ఆమె స్వయంగా లిఖితపూర్వకంగా విశాఖ పోలీస్ కమిషనర్‌కు ఆదేశించారన్నారు. అయినప్పటికీ పోలీసుల నుంచి కనీస స్పందన కరువైందని వాపోయారు. అనేకసార్లు సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్నప్పటికీ కూడా ఆయన కూడా స్పందించలేదన్నారు. హోంమంత్రిని కలిసిన వారిలో టిడిపి 14వ వార్డు అధ్యక్షుడు పి.వి.వసంతరావు, పి.జగదీష్ బాబు, బొడ్డేపూడి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలి: హోం మంత్రి అనిత

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి పుష్ప మాల అందజేసి ఘన స్వాగతం పలికారు. అర్చక స్వాములు, పండితులు పూర్ణ కుంభంతో ఆహ్వానించారు. తొలుత మంత్రి కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని తమ గోత్ర నామాలతో స్వామివారికి సంకల్పం చేయించారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈఓ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం హోం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి జరగాలని సింహాద్రి అప్పన్న స్వామిని కోరుకున్నానని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది పోలీసు అధికారులు ఆ పార్టీ నేతలకు తొత్తులుగా పనిచేశారని అనిత విమర్శిం చారు. ఇప్పటికీ వారిలో వైసీపీ రక్తం ప్రవహిస్తున్నట్లు వ్యవహరి స్తున్నారన్నారు. జగన్‌పై ఇంకా ప్రేమ ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసి ఆ పార్టీ కోసం పని చేసుకోవాలని హితవు పలికారు. శాంతిభద్రతల విషయంలో ఎవరు తప్పుచేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యంగా మహిళలకు అన్యాయం జరగకుండా చూస్తానని తెలిపారు. ఆమె వెంట జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గొల్లనారాయణపురంలో కార్పొరేటర్ కన్నా పర్యటన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 93వ వార్డు గొల్ల నారాయణ పురంలో స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా సోమవారం పర్యటించి, అక్కడి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు పల్లా అప్పలరాజు తదితరులు పోలిపల్లి అమ్మవారి ఆలయం నుండి కమ్యూనిటీ హాల్ వరకు పాడైపోయిన ప్రధాన రోడ్డు, వీధి కాలువలు నిర్మాణం గురించి కార్పొరేటర్‌ను అడిగారు. ఈ రోడ్లు, కాలువలు పరిశీలించిన కార్పొరేటర్ కన్నా జీవీఎంసీ వార్డు అభివృద్ధి నిధులు 19.85 లక్ష రూపాయలతో పనుల కోసం టెండర్ వేయడం జరిగిందని, త్వరలోనే పనులు చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు కిలారి చిన్నారావు, హరినాథ్, దుఃఖ అప్పారావు, నక్క శ్రీను, పల్లా రవి, జి.మహేష్, కర్రీ వెంకట్, కొయ్య అప్పలరాజు, కొయ్య సూర్యనారాయణ, నక్క ముత్యాలు, కిలారి అప్పా రావు, దుఃఖ స్వామి, నక్క చంద్రశేఖర్, కట్టు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన బోటు: వాసుపల్లి ఆర్థిక సాయం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఫిషింగ్ హార్బర్లో జెట్టి నంబర్ 11లో సముద్రంలో మునిగిపోయిన 295 నంబరు గల బోటుకు నష్టపరిహారం అందేలా అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. విషయం తెలుసుకున్న వాసుపల్లి గణేష్ కుమార్ సోమవారం ఉదయం బోటు ఓనర్లు కోడ లక్ష్మమ్మ, ఎర్రన్నను కలిసి రూ.10,000లు తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాయిస్ లేని తమ మత్స్యకారులకు ముందుగా గుర్తొచ్చేది తానేనని, అందుకే తక్షణమే నీట మునిగిన ఘటన స్థలానికి రావడం జరిగిందన్నారు. వేటకు సిద్ధం చేసుకుంటున్న బోటు పనులు ముగించుకుని రాత్రి ఇంటికి వెళ్లి ఉదయం తిరిగి రాగా సముద్రం మింగేసిన పరిస్థితి పట్ల దిక్కుతోచని కోడల లక్ష్మమ్మ ఎర్రన్నకు భరోసా కల్పించడానికి రావడం జరిగింది అన్నారు. నష్టపరిహారాన్ని అందేలా సమస్యను మత్స్య శాఖ జెడి దృష్టికి, కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యుడు ఎర్రన్న మాట్లాడుతూ వాసుపల్లి గణేష్ కుమార్‌కి తమ కుటుంబం తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పి.సి.అప్పారావు, మైలపల్లి మసెన్, గనగల్ల రామరాజు, కొండబాబు, అన్నెం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పల్లాకు ఘన స్వాగతం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన పల్లా శ్రీనివాసరావుకి 87వ వార్డు నేతలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం జగన్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో వార్డ్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీని ప్రారంభించారు. విమానాశ్ర యమునకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక విద్యా వంతుడు, అహర్నిశలు ప్రజల కోసం ఆలోచించే ఒక మహెూన్నతమైన వ్యక్తికి ఇటువంటి బాధ్యతలు అప్పగించిన నారా చంద్రబాబు నాయుడుకి గాజువాక నియోజకవర్గం ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు రాజన్న రాజు, విజయరామరాజు, సెక్రటరీ సత్తిబాబు, జిల్లా నాయకులు వర్రె రాంబాబు, కె.శ్రీనివాస్ వర్మ, సీనియర్ నాయకులు ఎస్.బాబురావు, పి.రమణమూర్తి, ఎస్.పెంటారావు, కె.ఈశ్వరరావు, వి.అప్పారావు, భాగ్యలక్ష్మి, దాలయ్య, జాన్ రమేష్, మూర్తి, పి.కృష్ణ, జి.అప్పారావు, ఎం.రాము, నాగేశ్వరరావు, కె.కృష్ణ, చక్రవర్తి, రంజిత్ పాల్గొన్నారు.

లోకం మాధవిని కలిసిన జనసేన టీం

విశాలాంధ్ర - ఆనందపురం: జనసేన విశాఖ జిల్లా రూరల్ కార్యదర్శి, మజ్జి శ్రీను, ఆనందపురం జనసేన పార్టీ మండల నాయకులు నెల్లిమర్ల శాసనసభ్యులు లోకం మాధవిని సోమవారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నెల్లిమర్ల నియోజవర్గానికి మొట్టమొదటిసారిగా మహిళ శాసనసభ్యులుగా ఎన్నికవ్వడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఆనందపురం మండల ఉపాధ్యక్షులు తాడివాడ శివకృష్ణ, విశాఖ జిల్లా జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో గంటాకు ఘన స్వాగతం

విశాలాంధ్ర - ఆనందపురం: సార్వత్రిక ఎన్నికల్లో భీమిలి నియోజక వర్గంలో అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించినందుకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం మండలంలోని పెద్దిపాలెం, సొంత్యాం గ్రామాల్లో టీడీపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విజయోత్సవ సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన పట్ల నియోజవర్గ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు మరువలేనిదన్నారు. ఎన్నికల ప్రచారాన్ని అన్నవరం గ్రామం నుంచి ప్రారంభించి రాష్ట్రంలోనే రెండో అత్యధిక మెజారిటీ 92,401 ఓట్ల తేడాతో గెలుపు అందించిన భీమిలి నియోజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి టీడీపీ ఇన్చార్జ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు, బిజెపి నాయకులు రామునాయుడు, మహంతి శివాజీ, బిఆర్‌బి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మౌలిక సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని తాండవ వాలి ఉద్యానవన, వ్యవసాయ రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార సంఘం అధ్యక్షులు విశ్వనాధుని వెంకట సత్యనారాయణ అన్నారు. సంఘం 2 వ వార్షిక సర్వసభ్య సమావేశం మండలంలోని సత్యవరం గ్రామంలో జరిగింది. సత్యనారాయణ మాట్లాడుతూ రైతులందరూ వాటా దనం చెల్లించి సభ్యులుగా చేరాలన్నారు. రైతులు తమ పంటలను నేరుగా అమ్మకాలు కాకుండా విలువ ఆధారిత వస్తువులుగా తయారుచేసి మార్కెటింగ్ చేయుట ద్వారా గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సీఈవో జీవివి సత్యనారాయణ, ప్రతినిధులు జీ. వర్మ, పి. సూర్యనారాయణ, శ్రీనివాస్, కీర్తి సీతారాం, వడ్డాది వాసు, ఎగదాసు నానాజీ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.